




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 9 సంచిక : 340 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | సోమవారం 10 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :340 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | MON 10 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

- రాజమండ్రి రోడ్డు ప్రమాద బాధితురాలు, మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ కన్నుమూత
- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్,

- మిగతా 2లో

## ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసింది.. నిందితులకు కఠిన శిక్షలు తప్పవు:



**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలో యువకుల తీవ్ర నిర్లక్ష్యం, మద్యం మత్తు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, ఎంతో భవిష్యత్ ఉన్న ఒక యువ వైద్యురాలు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆయన అన్నారు. ఈ దుర్ఘటనపై స్పందించిన

- మిగతా 2లో



## కాన్వాయ్ ఆపి.. ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీఎం చంద్రబాబు

- విజయవాడలో ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు
- తిరిగి ఉండవల్లి వెళుతూ ప్రకాశం బ్యారేజ వద్ద ఆగిన వైనం
- డెల్టా ఆయకట్టుకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్న అధికారులు
- పట్టిసీమ జలాలతో కృష్ణా డెల్టాకు నీటి కొరత తీరిందన్న ముఖ్యమంత్రి

- మిగతా 2లో

## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా ధింసా స్టెప్పులేసిన సీఎం

- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం, డప్పు కొట్టి అలరించిన సీఎం
- దేశానికి ఉన్నట్టే ప్రతి పౌరుడికీ వ్యక్తిగత విజన్ ఉండాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే తన సంకల్పమని స్పష్టం చేసిన చంద్రబాబు
- నిబద్ధతతో పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్ఘాటన



**పెన్ పవర్ డెస్క్:**అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వారితో మమేకమయ్యారు. డప్పు వాయిస్తూ, ధింసా నృత్యకారులతో కలిసి అడుగులు వేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. ఆదివారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర నేతలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ ధింసా నృత్యం, డప్పు వాయిద్యాల నడుమ సీఎం వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా డప్పు చేతబట్టి వాయించి సభలో కొత్త ఉత్తేజం నింపారు.అంతకుముందు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ప్రతి పౌరుడూ దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం కోసం ఓ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సంప్రదాయాలను కాపాడుతున్న గిరిజనులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని కొనియాడారు. సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి స్థాయికి ఎదగడమే దీనికి నిదర్శనమని గుర్తుచేశారు. “మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోదీ వంటి ఎందరో సామాన్యులే సంకల్ప బలంతో అసాధారణ విజయాలు సాధించారు” అని చంద్రబాబు అన్నారు. “నేను, నా దేశం, నా రాష్ట్రం అనే భావనతో ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్

- మిగతా 2లో



## దామచర్ల తానే రాజు తానే మంత్రి అనుకుంటున్నారు

- ఒంగోలులో టీడీపీ, జనసేన నేతల మధ్య ముదిరిన వివాదం
- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై జనసేన నేత బాలినేని తీవ్ర ఆరోపణలు
- ఇసుక, మైనింగ్, వైన్‌లో ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయని ఆరోపణ
- సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని విచారణ జరపాలని డిమాండ్
- పొత్తు ధర్మం వల్లే ఇంతకాలం ఓపిక పట్టామని, ఇక చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**అధికార కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన మధ్య ప్రకాశం జిల్లా ఒంగోలులో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం ముదిరింది. తాజాగా ఎమ్మెల్యే

- మిగతా 2లో

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

**పెన్ పవర్ డెస్క్:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ

- మిగతా 2లో





## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!

- భారత్‌తో రైల్వే కనెక్టివిటీ ఏర్పాటుకు రష్యా ప్రయత్నాలు
- హిందూ మహాసముద్రానికి ప్రత్యామ్నాయ భూమార్గంపై దృష్టి
- తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాక్ మీదుగా మార్గం పరిశీలన
- కీలక సముద్ర జలసంధులపై ఆధారపడటం తగ్గించుకోవడమే లక్ష్యం
- ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని స్పష్టం చేసిన రష్యా

**పెన్ పవర్ డెస్క్:**భారత్‌తో నేరుగా రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసి, తద్వారా హిందూ మహాసముద్రానికి భూమార్గం ద్వారా చేరుకునే అవకాశాలపై రష్యా అన్వేషిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుపై మాస్కో తీవ్రంగా దృష్టి సారించిందని, ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ ప్రణాళికను పరిశీలిస్తున్నామని రష్యా ఉప ప్రధాని

- మిగతా 2లో

## ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

**పెన్ పవర్ డెస్క్:**ఇజ్రాయెల్ లో సైనికులకు ఉన్న అన్ని సెలవుల ను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది.

- మిగతా 2లో



## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ.. కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!

- ఆపరేషన్ సింధూర్‌తో బ్రహ్మోస్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు
- పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా దేశంలోని నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతం
- భవిష్యత్తులో జలాంతర్గత, సూక్ష్మ వేరియంట్ల అభివృద్ధిపై శాస్త్రవేత్తల దృష్టి

**పెన్ పవర్ డెస్క్:**భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూ పర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీ యంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, ‘ఆపరేషన్ సింధూర్’ సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా,




- మిగతా 2లో

## మమతా బెనర్జీ కారుపై దాడి

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## ఏపీ, తెలంగాణ రాష్ట్రాలపై ఎల్ నినో ఎఫెక్ట్... నీటి ఇబ్బందులు తప్పవా?

ఎల్ నినో ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పడుతోంది. ప్రాజెక్టులకు వరద నీరు చేరుతున్నప్పటికీ వాటిని వదిలే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు పెద్ద టాస్క్ కానుంది. ఇప్పుడున్నపరిస్థితుల్లో సాగునీటికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం లేదు. కేవలం తాగునీరు, పశువులకు మాత్రమే అందించగలుగుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ తో ఈసారి రెండు రాష్ట్రాలు రైతులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు చేరుతున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోలేదు. అదే సమయంలో గేట్లు కూడా ఎత్తలేదు. దీంతో జలవిద్యుత్తు కూడా ఇప్పటి వరకూ శ్రీశైలం ఎడమ, కుడి జల విద్యుత్తు కేంద్రాల్లో ప్రారంభం కాలేదు.

**అనుకున్న స్థాయిలో...**

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల వానలు కురిసినప్పటికీ అనుకున్న స్థాయిలో పడలేదు. దీంతో గోదావరికి కొంత వరద నీరు చేరినా అవి రైతులకు వ్యవసాయం కోసం చేరే అవకాశాలు కనిపించడం లేదు. గోదావరి, కృష్ణా నదుల్లో ప్రస్తుత్తం ఉన్న నీటి నిల్వలను సాగుకు వదిలే అవకాశం లేదని ఏపీ వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కేవలం తాగునీరుకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తామని, అలాగే పశు వులకు అవసరమైన నీటిని అందించాలని ప్రభుత్వం నుంచి సాగునీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఎల్ నినో ప్రభావంతో రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు చాయలు ఇప్పటికే అలుముకున్నాయని ప్రభుత్వం చెబుతుంది.

**సాగర్ ఆయకట్టు కింద...**

ఇక తెలంగాణలోనూ వానలు ఏపీతో పోల్చుకుంటే కొద్దిగా పరవాలేదు. జూరాల ప్రాజెక్టుకు నీరు చేరింది. గోదావరి నదికి వరద నీరు రావడంతో కొంత ఆయకట్టు కింద ఉన్న రైతులకు సాగు నీరు అందే అవకాశముంది. కాళేశ్వరం, మేడిగడ్డ, శ్రీరామ్ సాగర్ తో పాటు జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇంకా నీరు సాగుకు విడుదల చేయలేదు. ఇక నాగార్జున సాగర్ కు అయితే నీరు ఇంకా చేరక దాని ఆయకట్టు రైతులు వ్యవసాయపరంగా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ప్రభుత్వం సాగర్ జలాశయం వద్ద ఈ నెల 10న వరుణయాగాన్ని కూడా చేపట్టింది. అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వానలు కురుస్తున్నాయే తప్ప అది సాగుకు ఉపయోగం లేని వానలని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం కొంత భూగర్భ జలాలు నిండటంతో ఖరీఫ్ సాగును ప్రారంభించారు.

## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!

- మొదటి పేజి తరువాయి

మరాత్ ఖుస్నుల్లిన్ స్వయంగా వెల్లడించారు. రష్యా వార్తా సంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక విషయాలను తెలిపారు.

కీలకమైన సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని ఖుస్నుల్లిన్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యంగా, బోస్ఫరస్ జలసంధి, హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన మార్గాలలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, వాటికి ప్రత్యామ్నాయంగా భూమార్గ రవాణా కారిడార్లను అభివృద్ధి చేయాలని రష్యా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది. ఈ మార్గాల్లో ఉండే ఉద్రిక్తతలు, ఇబ్బందులు తమ దేశ రవాణా వ్యవస్థపై ప్రభావం చూపకూడదనేది రష్యా వ్యూహంగా కనిపిస్తోంది.ఈ ప్రణాళికలో భాగంగా, రష్యా నుంచి బయలుదేరి తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా భారత్‌కు చేరుకునేలా ఒక రైల్వే కారిడార్‌ను నిర్మించడం ఒక ఆచరణీయమైన మార్గంగా ఖుస్నుల్లిన్ పేర్కొన్నారు. అయితే, భారత్‌కు చేరువయ్యేందుకు ఏ మార్గమైనా తాము పరిశీలించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేవలం ప్రాథమిక అన్వేషణ దశలోనే ఉంది. రైల్వే మార్గం, ప్రయాణికుల రైలు సర్వీసులు, టికెట్ ధరలు లేదా ప్రాజెక్టు ప్రారంభ తేదీ వంటి వివరాలేవీ ఇంకా ఖరారు కాలేదని ఆయన తెలిపారు.ఈ రైల్వే కారిడార్ వాస్తవరూపం దాల్చితే రష్యాకు, భారత్‌కు ఇరు దేశాలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సముద్ర మార్గాలపై పూర్తిగా ఆధారపడకుండా, హిందూ మహాసముద్రం వైపు తమ సరుకులను రవాణా చేయడానికి రష్యాకు ఇది మరో ముఖ్యమైన మార్గాన్ని అందిస్తుంది. అదే సమయంలో, మధ్య, దక్షిణాసియాతో రష్యాకు భూమార్గ కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుంది. భారత్‌కు కూడా ఈ కారిడార్ ద్వారా రష్యా, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్య, రవాణా సంబంధాలు మెరుగుపడతాయి. ప్రజల రాకపోకలు పెరిగి పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.అయితే, ఈ ప్రతిపాదన ఆచరణలోకి రావడం అంత సులభం కాదు. ఈ మార్గం పలు దేశాల గుండా వెళ్లాల్సి ఉండటం, భారీగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి రావడం వంటి సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా, రవాణా, భద్రత, సరిహద్దుల వద్ద సమన్వయం వంటి అనేక క్లిష్టమైన అంశాలు ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్నాయి. అయినప్పటికీ, ఇన్ని సవాళ్లు ఉన్నా, భారత్‌తో నేరుగా భూమార్గం ద్వారా కనెక్ట్ కావాలన్న రష్యా ఆలోచన వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

# కాన్వాయ్ ఆపి.. ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ (ఆగస్టు 9) విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని, తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి వెళుతున్న సమయంలో, మార్గమధ్యంలో తన కాన్వాయ్‌ను బ్యారేజీపై కొద్దిసేపు నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటి లభ్యత, డెల్టాకు నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 17.52 టీఎంసీల గోదావరి జలాలను విజయవంతంగా కృష్ణా నదికి తరలించినట్లు జలవనరుల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదల కారణంగా ఇదే సీజన్‌లో సుమారు 521 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వృథాగా కలిసిపోయిందని తెలిపారు.పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు సమృద్ధిగా కృష్ణా నదికి చేరుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నుంచి డెల్టాలోని వివిధ కాలువలకు మొత్తం 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 3,115 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 115 క్యూసెక్కుల చొప్పున నీటిని అందిస్తున్నట్లు వారు ముఖ్యమంత్రికి నివేదించారు.

# ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

- మొదటి పేజి తరువాయి

దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు (చీమ్ఖుఅమ్ఖుష్ట్రబ) మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి (ఠాతీఅనివం ాఅ ×తీఖుఅ) సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

**ట్రంప్ శాంతి ప్రణాళికలను వ్యతిరేకించిన నెతన్యాహు..**

ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఐశీఖుశ్రీస ఎతీబఎజూ) ప్రతిపాదించిన

15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు.

**దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్**

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

# మమతా బెనర్జీ కారుపై దాడి

- మొదటి పేజి తరువాయి

చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు.బిర్జూ అనే టీఎంసీ కార్యకర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే మృతి చెందాడు. తన భర్తను లాకప్‌లో కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జూ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, డోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

**పిల్లల భవిష్యత్తు కంటే మంత్రి పదవి ముఖ్యమేం కాదు: ధర్మేంద్ర ప్రధాన్**

"నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది" అని మమత ఆరోపించారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే మమత అక్కడికి వెళ్లారని భాజపా ఆరోపించింది. ఆమె రాకపై స్థానికులు నిరసన తెలిపారని పేర్కొంది.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- మొదటి పేజి తరువాయి

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు.నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ. 1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ. 25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ

సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ.. కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!

- మొదటి పేజి తరువాయి

ఇప్పటికే కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన ప్రతిష్ఠ**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది.

**పెరిగిన ఉత్పత్తి.. భవిష్యత్ ప్రణాళికలు**

పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**బ్రహ్మోస్ ప్రస్థానం**

బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా (చీూా మీఖంష్ట్రఅఅశీరితీశీఎవఅఱఖు) సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు.మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా థింసా స్టెప్పులేసిన సీఎం

- మొదటి పేజి తరువాయి

సాధించాలనేది నా సంకల్పం" అని స్పష్టం చేశారు. ఒక రైతు పంట పండించినా, ఒక విద్యార్థి బాగా చదివినా, ఉద్యోగి నిబద్ధతతో పనిచేసినా అదంతా దేశ నిర్మాణంలో భాగమేనని ఆయన వివరించారు. "వ్యక్తిగతంగా విజయం సాధించడం కూడా దేశ నిర్మాణంలో భాగమే. పనిచేసే ప్రతి వ్యక్తీ సమాజానికి ఆస్తి. అందరి గెలుపే దేశం గెలుపు" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' దార్శనికతకు అనుగుణంగా, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విజన్‌తో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసింది.. నిందితులకు కఠిన శిక్షలు తప్పవు:

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి, ప్రియాంక మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "తమ నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌తో ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చూస్తాం. ఈ విషయంలో ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిందితులపై కఠినమైన సెక్షన్లు నమోదు చేసి, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు.ఈ ఘటనకు కారణమైన యువకులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రియాంక కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన చంద్రబాబు, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను అన్ని రకాలుగా ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. యువత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, క్షణికావేశంలో చేసే తప్పులు ఇతరుల జీవితాలను నాశనం చేస్తాయని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

## దామచర్ల తానే రాజు తానే మంత్రి అనుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

దామచర్ల తీరుపై బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలై, ఆ తర్వాత జనసేనలో చేరిన బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఎమ్మెల్యే దామచర్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దామచర్ల అరాచకాలు పెరిగిపోయాయి. తానే రాజు, తానే మంత్రి అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుతో సొంత పార్టీ టీడీపీ కార్యకర్తలే ఇబ్బందులు పడుతున్నారు" అని బాలినేని ఆరోపించారు. తమ వారిపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని, తప్పు చేయని తన వాళ్లను కాపాడుకోలేకపోతే తాను నాయకుడిగా ఉండి ఉపయోగం ఏంటని బాలినేని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంతటితో ఆగకుండా, ఎమ్మెల్యేపై నేరుగా అవినీతి ఆరోపణలు చేశారు. "ఇసుక, మైనింగ్, వైన్‌లో ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయి. ఆయనకు ప్రతిరోజూ మామూళ్లు అందుతున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే విచారణకు ఆదేశించాలి. అప్పుడే నిజానిజాలు బయటకు వస్తాయి" అని బాలినేని డిమాండ్ చేశారు.కూటమిలో పొత్తు ధర్మం పాటించాలనే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ తాము మౌనంగా ఉన్నామని, అయితే ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. "మా ఓపిక నశించింది. ఇకపై మేం, మా కార్యకర్తలు చూస్తూ ఊరుకోం. ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం," అని బాలినేని స్పష్టం చేశారు. ఈ బహిరంగ ఆరోపణలతో ఒంగోలులో కూటమి నేతల మధ్య విభేదాలు వీధికెక్కాయి. స్థానిక నాయకుల మధ్య మొదలైన ఈ పోరు, రాష్ట్రస్థాయిలో కూటమి నాయకత్వానికి కొత్త తలనొప్పిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

- మొదటి పేజి తరువాయి

ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్లు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్లు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు.ప్రియాంక స్వస్థలం తెలంగాణ లోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## రాజమహేంద్రవరం మెడికో విద్యార్థిని ప్రియాంక మృతికి నివాళి

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 9:** రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్య షాపింగ్ మాల్ వద్ద మెడికో విద్యార్థి తీవ్రంగా గాయపడి ఆదివారం హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్ లో మృతి చెందడంతో జగ్గంపేటలో పిడి ఎస్ యు విజృంభణ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పిడి యస్ యు విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్య మాల్ లో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు అతి దారుణంగా ఆ విద్యార్థిని కారుతో గుద్ది ప్రమాదం చేయడం జరిగిందన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన నిందితుల పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యాక్సిడెంట్ చేసిన దుర్మార్గులకు రాజమహేంద్రవరం ఎమ్మెల్యే వత్తాసు పలకడం, సపోర్ట్ చేయడం చాలా దారుణమని అయన విమర్శించారు. ఈ విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి స్పందించి తక్షణమే ఆక్సిడెంట్ చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించి, డాక్టర్ ప్రియాంక




కుటుంబానికి ఐదు కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వాది నీలపల్లి అప్పారావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# తాండవిస్తున్న అపరిశుద్ధ్యం

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు.. మురుగుతో ఇక్కట్లు
- మచ్చుకైనా కనిపించని బ్లీచింగ్ చర్యలు
- అంటు వ్యాధుల భయంతో ప్రజల్లో ఆందోళన
- ప్రత్యేక అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్న స్థానికులు

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 09:**గండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు రహదారులు, వీధుల్లోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మండల కేంద్రమైన గండేపల్లిలోని వేలంపేట, కృష్ణుడి గుడి వీధి, మన సుబ్బారావు వీధి తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వాటర్ పైపులు లీకేజీ కావడంతో నీరు రోడ్లపై ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని వారు వాపోతున్నారు.

**చెత్తతో నిండిన డ్రైనేజీలు**

పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదు. ఫలితంగా మురుగునీరు రోజుల తరబడి నిలిచిపోతుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా, రాకపోకలు సాగించాలన్నా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**దోమలు, ఈగలతో భయం**

మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు మురుగునీటి మధ్య రాకపోకలు సాగించాల్సి రావడంతో ఇబ్బందులు మరింత పెరిగాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**బ్లీచింగ్ ఎక్కడ?**

గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు ఇంత అధ్వానంగా ఉన్నప్పటికీ మురుగునీరు నిలిచిన ప్రాంతాల్లో బ్లీచింగ్ వంటి ముందస్తు పారిశుధ్య



చర్యలు మచ్చుకైనా కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. డ్రైనేజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**ప్రత్యేక అధికారులు ఏం చేస్తున్నారు?**

ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు అనుగుణంగా చర్యలు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గండేపల్లి మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం కొనసాగితే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.








## ఆల్ ఈజ్ వెల్ ఆధ్వర్యంలో 32 మొక్కలు నాటిన విద్యార్థులు

**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 9:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాకినాడలోని పల్లంరాజు నగర్ మున్సిపల్ పార్కులో ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆదిత్య విద్యాసంస్థల జెన్ గ్రీన్ విద్యార్థులు కలిసి 32 మొక్కలు నాటారు. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకుడు కిశోర్ మాట్లాడుతూ అటవీ శాఖ అందజేసిన వివిధ రకాల మొక్కలను వర్షాకాలం ముగిసేలోపు కాకినాడలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా నాటుతామని తెలిపారు. ప్రజలు వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాల్లోకి మళ్లించాలని, నదులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి సిద్ధమైన ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.ఆల్ ఈజ్ వెల్ సభ్యులు, దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమన్నారు. అడవుల విచ్చలవిడి నరికివేతతో అనేక జీవజాతులు అంతరించిపోతున్నాయని, భూతాపం, అకాల వర్షాలు, కరువులు వంటి సమస్యలను తగ్గించేందుకు పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం, క్రిమిసంహారక మందులు, కృత్రిమ ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజకుమార్, కార్యదర్శి టి.వి.వి.ఎస్.ఎన్. రెడ్డి, డాక్టర్ రవివర్మ,



విక్రమ్, రాజేంద్ర, శ్రీనివాసు, వెంకటనారాయణ,సీనియర్ సిటిజన్లు కరి నాగభూషణం, కృష్ణారావు, స్వామి తదితరులతో పాటు సుమారు 30 మంది జెన్ గ్రీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉప్పాడ బీచ్ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసులు ఉప్పాడ బీచ్ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఉప్పాడ కొత్తపల్లి ఎస్సై జి. వెంకటేష్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.బీచ్ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులకు బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించే చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాల ముప్పు అధికంగా ఉంటుందని,వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించిన సమయంలో వాహనాలు నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను వినియోగించాలని,రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రజల భద్రత,రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## దొమ్మేటి వెంకటరెడ్డి త్యాగం నేటి తరానికి ఆదర్శం: మంత్రి సుభాష్








చీడిగలో శెట్టిబలిజ పితామహుడి విగ్రహావిష్కరణ

**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 9 :** విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని నమ్మి తన వందలాది ఎకరాల భూములను దానం చేసిన గొప్ప త్యాగధనుడు, శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. బీసీల ఆత్మగౌరవ పరిరక్షణ, గీత కార్మికుల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామంలో మాజీ సర్పంచ్ పితాని అప్పన్న ఆధ్వర్యంలో,కాకినాడ రూరల్ ఇన్‌చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ త్యాగానికి తగిన గౌరవం కల్పిస్తోందన్నారు.గీత వృత్తిని నమ్ముకుని ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం అందిస్తోందని తెలిపారు.డీఎస్సీని పారదర్శకంగా నిర్వహిస్తున్నప్పటికీ వైసీపీ నాయకులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి విద్యాభిలాష,సేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శమన్నారు.ఆయన ఆశయాల సాధనకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విగ్రహ దాత పాలిక శ్రీను, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి,ఏపీ స్టేట్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు,ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ కదలి ఈశ్వరి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, కౌడా చైర్మన్ తలాటం సత్య,జడ్పీటీసీ గుబ్బల తులసికుమార్,ప్రముఖ వైద్యులు డాక్టర్ కాదా వెంకటరమణ, నాయకులు పెంకే శ్రీనివాస బాబా, గుత్తుల బుల్లిరాజు,చొల్లంగి వేణుగోపాల్ తదితరులతో పాటు కూటమి నేతలు, బీసీ సంఘాల ప్రతినిధులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎల్ఎల్ఐఎన్ దోమతెరల పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 9:** మలేరియా, డెంగ్యూ తదితర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణలో భాగంగా లాంగ్ లాస్టింగ్ ఇన్‌సెక్టిసైడల్ నెట్స్ (ఎల్ఎల్ఐఎన్) దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట బాలికల వసతి గృహం, రాజపూడి బాలుర వసతి గృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, టిడిపి పోలిట్ సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజపూడి వైద్యాధికారులు డాక్టర్ ఎన్. పూజ, డాక్టర్ ఎం.మురళి పాల్గొని విద్యార్థులకు ఎల్ఎల్ఐఎన్ దోమతెరల ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల పట్ల ప్రత్యేక ప్రేమతో వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తూ దోమతెరలు అందించడం జరిగిందన్నారు. దోమకాటును నివారించడంతో పాటు మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి విద్యార్థి ప్రతిరోజూ రాత్రి దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు దోమతెరలను సక్రమంగా ఉపయోగించే విధానం, వాటిని పరిశుభ్రంగా సురక్షితంగా నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే వసతి గృహాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల ఉత్పత్తి నివారణకు తగిన చర్యలు తీసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, కొత్త కొండబాబు, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, ఉప్పలపాటి బుల్లెబ్బ, పీలా మహేష్, వేములకొండ జోగారావు, వసతి గృహాల సూపర్‌వైజర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబర్ నాగేంద్ర చౌదరికి సత్కారం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 9:** ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కిర్లంపూడిలోని విజ్ఞాన భారతి పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా అన్నవరం ట్రస్ట్ బోర్డు నెంబర్ పాలచర్ల నాగేంద్ర చౌదరిని ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, పాఠశాల నిర్వాహకులు ఆదివారం జగ్గంపేటలో ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర జిల్లాల నుంచి వచ్చే గోష్ వాయిద్య బృందాలతో, కిర్లంపూడి పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన సుమారు 700 మంది స్వయంసేవకులు, విద్యార్థులు, దేశభక్తులు పాల్గొనే విధంగా ప్రత్యేక గోష్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశభక్తి, జాతీయ ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని చాటిచెప్పే విధంగా గోష వాయిద్య బృందాలతో నిర్వహించే కార్యక్రమం అనంతరం సాయంత్రం విజ్ఞాన భారతి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నాగేంద్ర చౌదరికి సాలువాకప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఎం. సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు ఎస్.సత్తిరాజు గారు, విశ్వహిందూ పరిషత్ కె.విశ్వనాథం, విజ్ఞాన భారతి పాఠశాల కిర్లంపూడి ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

## అన్నవరం కొండపై నెయ్యి వత్తుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ





**అన్నవరం: పెన్ పవర్ ఆగస్ట్ 9** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం రత్నగిరి కొండపై భక్తులకు విక్రయిస్తున్న నెయ్యి వత్తుల నాణ్యతపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

రత్నగిరిపై స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు విక్రయిస్తున్న నెయ్యి వత్తుల నాణ్యత, ప్రమాణాలను ఆయన స్వయంగా పరిశీలించారు. నెయ్యి వత్తుల దుకాణాన్ని సందర్శించి, విక్రయానికి ఉంచిన వత్తులను పరిశీలించడంతో పాటు వాటి తయారీలో ఉపయోగిస్తున్న నెయ్యి నాణ్యతపై వ్యాపారులను ఆరా తీశారు.

వత్తుల తయారీలో నాణ్యమైన నెయ్యిని మాత్రమే వినియోగిస్తున్నారా? ఏమైనా మిశ్రమాలు కలుపుతున్నారా? అనే అంశాలపై వ్యాపారులను ప్రశ్నించారు. భక్తుల విశ్వాసం, భక్తిభావాన్ని వ్యాపార ప్రయోజనాలకు దుర్వినియోగం చేయవద్దని సూచించారు. నాణ్యమైన నెయ్యి వత్తులను మాత్రమే నిర్ణీత ధరలకు విక్రయించాలని ఆదేశించారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా కల్తీ నెయ్యి వత్తులను విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు.

"స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల నమ్మకాన్ని కాపాడటం మన అందరి బాధ్యత. భక్తులకు నాణ్యమైన వస్తువులు అందేలా వ్యాపారులు సహకరించాలి" అని నల్లం సూర్యచక్రధరరావు సూచించారు.

# అన్నవరం నూతన అన్నదాన భవన నిర్మాణ పనుల పరిశీలన





### నాణ్యతా ప్రమాణాల్లో రాజీ వద్దు.. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి: అధికారులు

**అన్నవరం:పెన్ పవర్ ఆగస్ట్ 9** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి రత్నగిరి కొండపై కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రసాద్' పథకం నిధుల భాగస్వామ్యంతో శరవేగంగా నిర్మాణంలో ఉన్న నూతన అన్నదాన భవన నిర్మాణ పనులను ఆదివారం ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధర్ రావు, ప్రభుత్వ టెక్నికల్ అడ్వైజర్, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సుబ్బారావు, (ఈఈ) విజయ భాస్కర్ రెడ్డి, ఏపీ టూరిజం (ఏఈ) వెంకటేష్, అన్నవరం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు.

నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా అత్యున్నత ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు అధికారులు స్పష్టం చేశారు. భవన నిర్మాణంలో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యత, పనుల పురోగతి, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు.

రత్నగిరికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో కొత్త అన్నదాన భవనంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నప్రసాద వితరణ జరిగేలా భవన డిజైన్, వంటశాల, భోజన వసతి, తాగునీరు తదితర మౌలిక వసతులను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు.

ఒకేసారి పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నప్రసాదం అందించేలా భవన నిర్మాణం ఉండాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తిచేయాలని సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా నిర్మాణ పనులను పూర్తి చేసి భవనాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన సాంకేతిక, పరిపాలనాపరమైన సూచనలను టెక్నికల్ అడ్వైజర్ సుబ్బారావు అందించారు.


ఈ కార్యక్రమంలో దేవస్థానం, పర్యాటక శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకరణలో శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి, ముత్యాలమ్మ

పుట్టింటి ఆడపడుచులతో ఆలయ ప్రాంగణం అంతా సందడి వాతావరణం







**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 9:** ఆషాఢమాసం సందర్భంగా ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి ముత్యాలమ్మ అమ్మవార్లకు శాకాంబరి అలంకరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. శాకాంబరి అలంకరణలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ర్యాలి గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన ఆడపడుచులు అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా సారెను తీసుకువచ్చి అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆషాఢమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకపోకలు, దర్శనం, అన్నప్రసాదం తదితర అంశాలపై సిబ్బంది పర్యవేక్షణ చేపట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ చైర్మన్ నామాల శ్రీనివాస్, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ద్వారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా జరగడానికి సహకరించిన భక్తులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు

చందన స్వరూపుడు దర్శించుకున్న అనంతపురం పార్లమెంటు సభ్యులు : అంబికా లక్ష్మీనారాయణ







**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 9:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఏడు వారాల వెంకన్న నోము నోచుకునే భక్తులతో ఆలయ మాడవీధులు కిక్కిరిసిపోయాయి. భక్తులు ఏడు ప్రదక్షిణలు చేస్తూ 'గోవిందా.. గోవిందా.. వెంకటరమణా గోవిందా' అంటూ గోవింద నామస్మరణ చేయడంతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.

శనివారం మాత్రమే కాకుండా ఆదివారం కూడా ఏడు వారాల నోము నోచుకునే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం, ప్రదక్షిణలు, పూజా కార్యక్రమాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి నల్లా సూర్యచక్రధర్‌రావు తెలిపారు.

### స్వామివారిని దర్శించుకున్న ఎంపీ

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ వాడపల్లి శ్రీ చందన వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో ఎంపీని సత్కరించారు.

# పాశాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

**-జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.**

**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు 9:**పాశాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరి పైనా ఉండాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో శ్రీ పాశాలమ్మ తల్లి అమ్మవారి సంబరాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన బోనాల కార్యక్రమం, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృప, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.సోమవరం గ్రామంలో పాశాలమ్మ తల్లి సంబరాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక భక్తికి ప్రతీకగా నిలుస్తుందని తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మత్సా తిరుపతిరాయుడు,వాసిరెడ్డి శ్రీను,జట్ల వీరబాబు,టీడీపీ నాయకులు సూతి శ్రీను
జంపన రవి,జంపన చిరంజీవి
జ్యోతుల బాబ్జి,జ్యోతుల కోటి గ్రామ పెద్దలు,మాదారపు వీరబాబు,



కాయల మణికంఠ,వెంకటేష్, గుంటముక్కల పెద్ద, చిన్న, ఎలుగంటి రామకృష్ణ,కొలమూరు భద్ర,పబ్బిరెడ్డి మణికంఠ,ఉత్సవ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు, జనసైనికులు, మహిళలు, యువత, భక్తులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

**-రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై టిడిపి నాయకులు ఇంటింటా ప్రకారం.**



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 09:**ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా టిడిపి నాయకులు అన్నారు. జగంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రమైన కిర్లంపూడి రమణయ్యపేటలో ఇంటింటికి టిడిపి ప్రచార కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు తూము కుమార్,కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, పలువురు టిడిపి నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా గెద్దాడ శ్రీనివాసరావు



**ఆలమూరు పెన్ పవర్ ఆగస్టు 9:**మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా ఆలమూరు మండల అధ్యక్షుడిగా గెద్దాడ శ్రీనివాసరావును నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు పసుపులేటి మహాలక్ష్మి, మండల అధ్యక్షుడు సుంకర శ్రీరాములు ప్రకటించారు.సమావేశంలో పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, నిధులను ప్రజలకు చేరేలా కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు కోరారు.అంత్యోదయ స్ఫూర్తితో సమాజంలోని చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల పేర్లను కూడా సమావేశంలో సేకరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పసుపులేటి మహాలక్ష్మి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అన్ని కులాలు, వర్గాలను గౌరవిస్తూ సమాజంలోని ప్రతి ఒక్కరి అభ్యున్నతికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఓబీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పార్టీ తరఫున నిరంతరం పనిచేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి స్వామినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సత్యప్రసాద్, శీలం నరసింహశెట్టి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడవెల్లి రాంబాబు, సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మిద్దె పురుషోత్తం, బుర్ర ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధయ్య, టేకుమూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న 65 వేల మంది భక్తులు





- ఒక్కరోజులో రూ.18 లక్షలకు పైగా దేవస్థానం ఆదాయం
- భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించిన అధికారులు

**పెన్ పవర్ ప్రతినిధి (తుని:) ఆగస్టు 09:** కాకినాడ జిల్లా తుని మండలం లోవలోని శ్రీ తలుపులమ్మ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 65 వేల మంది భక్తులు శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు.

**రూ.18,00,812 ఆదాయం**

ఆదివారం ఒక్కరోజులో దేవస్థానానికి వివిధ మార్గాల ద్వారా మొత్తం రూ.18,00,812 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి శ్రీ విశ్వనాథ రాజు తెలిపారు.

వివరాల ప్రకారం.. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.4,90,205, పూజా టిక్కెట్ల ద్వారా రూ.10,25,250, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.38,080, వాహన పూజలు, ఇతర సేవల టిక్కెట్ల ద్వారా రూ.20,610, కాటేజీల ద్వారా రూ.1,10,130, ఇతర మిసిలేనియస్ డొనేషన్ల ద్వారా రూ.55,157, వేద ఆశీర్వచనం ద్వారా రూ.61,380 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

**ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు**


భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో భక్తులకు అవసరమైన సదుపాయాలను దేవస్థానం అధికారులు అందుబాటులో ఉంచారు. భక్తుల సౌకర్యాలు, దర్శన ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ విశ్వనాధ రాజు మరియు దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పి. భాస్కర సత్యనారాయణ పర్యవేక్షించారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు. భారీగా భక్తులు తరలివచ్చినప్పటికీ దర్శన ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వాడపల్లి వెంకన్న నిత్య అన్నదానానికి రూ.1.01 లక్షల విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 9:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ ఏడు వారాల చందన వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి తణుకు పట్టణానికి చెందిన కాటూరి లక్ష్మణరావు, విజయ వెంకటలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించాలనే ఉద్దేశంతో దాతలు ఈ విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి నల్లా సూర్యచక్రధర్‌రావు దాతలను అభినందించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ నిత్య అన్నదానానికి సహకరించిన దాతలకు ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి సేవా కార్యక్రమాలకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

## ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఘన సత్కారం




**పెన్ పవర్ ఆగస్టు 9:**ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబరిచి ట్రిబుల్ ఐటీకి ఎంపికైన ర్యాలి హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులను అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. విశాఖపట్నానికి చెందిన మచ్చా నిరంజన్‌కుమార్ ప్రోత్సాహంతో నిర్వహించిన కార్యక్రమంలో మేఘన, సత్యవేణి, పవన్ చైతన్య, నవ్యశ్రీ, లక్ష్మి నరసమ్మ, జ్ఞానకుమార్, సుధీర్‌కుమార్‌లకు గౌరవ పురస్కారాలతోపాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

అంతకుముందు విద్యార్థులను వారి తల్లిదండ్రులతో కలిసి మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ మోహిత్, సీత, శ్యామ్, జాదూగర్, అన్నపూర్ణ, శ్రీకాంత్, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపట్నంలో ఘనంగా నంగాలమ్మ అమ్మ వారికి సారె సమర్పణ

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 09:**ఆషాఢ మాస పూజల సందర్భంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ నంగాలమ్మ అమ్మవారికి తొలిసారిగా సారె సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామస్తులు,మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పసుపు, కుంకుమ,గాజులు,పట్టు వస్త్రాలు,పండ్లు,పిండివంటలతో కూడిన సారెను మంగళ వాయిద్యాలు,కోలాట నృత్యాల మధ్య భారీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అలంకరణలు నిర్వహించి పసుపు,కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు.ఆషాఢ మాసంలో తొలిసారిగా సారె సమర్పణ జరగడంతో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు,పులిహోర పంపిణీ చేశారు.గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో,పాడిపంటలతో,ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రేషన్ బియ్యం దందాకు 'అధికారుల' అండా?





* పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై ఆరోపణలు
* వీఆర్వో వచ్చినా చర్యలు లేవని గ్రామస్తుల ఆవేదన
* 'ముడుపులు ఇస్తున్నాం.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు' అన్న దళారుల వ్యాఖ్యలపై కలకలం

**పెన్ పవర్ ప్రతినిధి (తొండంగి:) ఆగస్టు 09,**
పేదల కడుపు నింపాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం పక్కదారి పడుతోందా? కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, తరలింపుపై వస్తున్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి.
గ్రామంలోని రేషన్ షాప్ పరిధిలో బియ్యాన్ని అక్రమంగా సేకరించి సంచుల్లో నిల్వ చేస్తున్నారని, అనంతరం రాత్రివేళల్లో దళారుల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం ఇచ్చినా.. చర్యలు శూన్యం?
రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో స్థానికులు అక్కడికి చేరుకుని అధికారులకు సమాచారం అందించినట్లు చెబుతున్నారు. దీంతో వీఆర్వో సంఘటనా స్థలానికి వచ్చినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెళ్లిపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
సంబంధిత సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరగా, వారి ఫోన్ నంబర్ తన వద్ద లేదని వీఆర్వో చెప్పినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పరిణామంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

'ముడుపులు చెల్లిస్తున్నాం'.. నిజమెంత?
ఈ వ్యవహారంలో కొందరు దళారులు అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నామని, తమపై ఎలాంటి చర్యలు తీసుకోలేరని బహిరంగంగా వ్యాఖ్యానించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
ఈ వ్యాఖ్యలు నిజంగా చేశారా? చేస్తే ఎవరికి ముడుపులు చెల్లిస్తున్నారనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగాల్సి ఉంది.

పేదల బియ్యం.. దళారుల పాలా?
ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా పక్కదారి పడితే అసలైన లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇలాంటి వ్యవహారాలు తరచూ జరుగుతున్నాయని, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా?
రేషన్ బియ్యం అక్రమ నిల్వ, తరలింపుపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
అక్రమాలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అధికారుల నిర్లక్ష్యం లేదా ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలితే వారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
ఇక రేషన్ బియ్యం వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపడతారా? గ్రామస్తుల ఆరోపణలకు సమాధానం దొరుకుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## యర్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ ను సందర్శించిన ఏ డి ఈ మాదర్స్ సయ్యద్.

* రైతులకు 9 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తామని ఏ డి ఈ హామీ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 9:** మండల పరిధిలోని యర్రవరం గ్రామంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ ను ఎ డి ఈ మాదర్స్ సయ్యద్ ఆదివారం సందర్శించారు. యర్రవరం గ్రామంలో 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ సిరిపురం గ్రామ రైతాంగానికి సాగునీరు అందడం లేదని, విద్యుత్ సరఫరా సరిగాలేదని శనివారం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి రైతులు నిరసన తెలిపారు. ఈ మేరకు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మాదర్స్ సయ్యద్ విద్యుత్ సబ్‌స్టేషన్కు విచ్చేసి విద్యుత్ సరఫరా లాగ్ బుక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాదర్స్ సయ్యద్ మాట్లాడుతూ రైతులు నెల రోజులుగా తమ వ్యవసాయ బోర్లకు పేరవరం సంబంధించి విద్యుత్తు అందించడం లేదని తెలిపారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రికార్డులు తనిఖీ చేయగా ఈ నెలలో 3వ తేదీ , 7వ తేదీన పేరవరం గ్రామానికి సంబంధించి వ్యవసాయ బోర్లకు త్రీ ఫేజ్ కరెంటుకు రెండు రోజులు అంతరాయం కలిగిందని అన్నారు. రెండు పెద్ద చెట్లు విరిగి విద్యుత్ లైన్ పై పడిన కారణంగా ఒకరోజు సాంకేతిక సమస్యతో ఏడో తేదీన మాత్రమే రైతులకు 9 గంటలు విద్యుత్ అందించలేకపోయామని,మిగిలిన 28 రోజులు విద్యుత్ సరఫరా 9గంటలు యధావిధిగా కొనసాగిందని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలతో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలించమని రైతులకు నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్తు సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. ఏడీఈ వెంట ఏ ఈ బి.సూర్యనారాయణ, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

## పెద్దాపురం మరిడమ్మ జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు





**పెద్దాపురం, పెన్ పవర్ ఆగస్టు 9:** పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ జిల్లా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ ఎబిజి తిలక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వై.ఆర్.కె.శ్రీనివాస్,ఎస్సైలు,పోలీసు సిబ్బంది జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.జాతరలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు,ఆలయ పరిసరాలు,రద్దీ ప్రాంతాలు,పార్కింగ్, ట్రాఫిక్‌ను పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు.దొంగతనాలు,చైన్ స్నాచింగ్‌లు,పిక్‌పాకెటింగ్,ద్విచక్ర వాహనాల చోరీలకు అవకాశం ఉన్న నేపథ్యంలో మైక్‌లు,ఆడియో ప్రకటనల ద్వారా భక్తులను అప్రమత్తం చేశారు. భక్తులు తమ విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్లు,నగలు,వాహనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.వృద్ధులు,చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జాతర ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

## జనార్దన స్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పద్మశ్రీ దంపతులు




**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 09;**నారద ప్రతిష్టిత అత్యంత మహిమాన్వితమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామివారిని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ రామచంద్రపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పద్మశ్రీ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సాదరంగా ఆహ్వానించారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నారద మహర్షి ప్రతిష్ఠితమైన జనార్దన ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె అన్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణించకుండా చూడడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు కాకినాడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ఆటోల్లో వెనుక వైపు, డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకుని ప్రయాణించరాదని పోలీసులు సూచించారు. పెద్దలకు 3o1, పాఠశాల విద్యార్థులకు 6o1 పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ కుడివైపు డోర్‌ను ఎల్లప్పుడూ మూసి ఉంచాలని, ఇరువైపులా బ్యాక్‌సైడ్ మిర్రర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.
అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్-1 సీఐ ఎన్. రమేష్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరిస్తేనే సురక్షిత ప్రయాణం



కాకినాడ ట్రాఫిక్ పోలీసులు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** రోడ్డు ప్రమాదాల నివారణ, ద్విచక్ర వాహనదారుల ప్రాణ భద్రతే లక్ష్యంగా కాకినాడ జిల్లా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.ఎస్.ఎన్. రాజు ఆధ్వర్యంలో వివిధ ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు.
హెల్మెట్ ధరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన పాటించడం మాత్రమే కాదని, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే అత్యంత ముఖ్యమైన రక్షణ చర్య అని వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వాహనదారులకు వివరిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు."హెల్మెట్ పోలీసుల కోసం కాదు.. మన ప్రాణాల కోసం. హెల్మెట్ ధరిద్దాం.. సురక్షితంగా ఇంటికి చేరుదాం" అని పోలీసులు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు జిల్లాలో నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## గొల్లప్రోలులో భారీ కార్డన్ అండ్ సెర్చ్





* 58 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
* మత్తు పదార్థాలు, నాటు సారా, అక్రమ మద్యం కోసం విస్తృత తనిఖీలు
* అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: పోలీసులు

**పెన్ పవర్ ప్రతినిధి (గొల్లప్రోలు),, ఆగస్టు 09:**శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు గ్రామంలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాకినాడ సబ్‌డివిజన్ ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో పిఠాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ తనిఖీలు చేపట్టారు.
గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగప్ప చెరువు ప్రాంతాన్ని పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, అనుమానాస్పద ప్రాంతాల్లో అణువణువూ గాలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించడంతో పాటు పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.
ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నాటుసారా, అక్రమ మద్యం నిల్వలు, బెల్ట్ షాపులపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

58 బైక్‌లు స్వాధీనం
తనిఖీల్లో సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు లేని మొత్తం 58 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే వారి వివరాలను తెలుసుకోవాలని కోరారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల విక్రయాలు, నాటుసారా తయారీ లేదా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు.
ఈ తనిఖీల్లో గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ, పిఠాపురం టౌన్ ఎస్సై లోకేష్, యు.కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ తదితరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో పోలీసుల ప్రత్యేక నిఘా







**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** సందర్శకులు, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో పోలీసులు భద్రతను మరింత పెంచారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు తిమ్మాపురం పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాలతో బీచ్ పరిసరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకుల కదలికలతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, గుంపులు, అసాంఘిక కార్యకలాపాలు, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లే వారి కదలికలపై డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పర్యవేక్షణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.బీచ్‌కు వచ్చే ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని, సముద్రంలో ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు బీచ్‌పై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## ఆగస్టు 12, 13 తేదీల్లో అమరావతి ఛాంపియన్‌షిప్--2026 జిల్లా స్థాయి పోటీలు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్--2026 జిల్లా స్థాయి టోర్నమెంట్, ఎంపికల పోటీలు ఆగస్టు 12, 13 తేదీల్లో కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.

ఆగస్టు 12న అండర్--17, అండర్--23 బాలికలకు, ఆగస్టు 13న అండర్--17, అండర్--23 బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు మాత్రమే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు.పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్పోర్ట్స్ యాప్ ద్వారా చేసుకున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కాపీ ఒరిజినల్స్‌తో పాటు జిరాక్స్ ప్రతులను తీసుకు రావాలని సూచించారు. పోటీలు ప్రారంభమయ్యే సమయానికి ఉదయం 8 గంటలకు వేదికకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించని క్రీడాకారులను పోటీల్లో పాల్గొనడానికి అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన క్రీడాకారులు నిర్ణీత తేదీల్లో అవసరమైన పత్రాలతో హాజరై ప్రతిభ కనబరిచి జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

## లోకకళ్యాణార్థం ముత్యాలమ్మ తల్లి కి ఆషాఢ సారె






**అల్లవరం, పెన్ పవర్,ఆగష్టు09,**ఆషాఢ మాసంలో అమ్మవార్ల కు సారే సమర్పణ చేస్తే అమ్మ దయవల్ల రాష్ట్రం,గ్రామం సుభిక్షంగా ఉంటుందని లోకకళ్యాణార్థం ఆషాఢ సారే కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించినట్లు గ్రామస్తులు అన్నారు.ఆదివారం తూర్పులంక గ్రామంలోముత్యాలమ్మ వారి కి సారె కార్యక్రమం చేపట్టారు.రామాలయం నుండి మహిళలు ఆలయం నుండి ఆలయ అర్చకులు,వేద పండితుల మంత్రోచ్చారణ లమధ్య గ్రామదేవతలైన ముత్యాలమ్మ వారి ఆలయానికి చేరుకొని సారే సమర్పించారు. తొలుత అమ్మవారికి, గ్రామం సుబిక్షం గా ఉండాలి అని ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామస్తుల తరపున సమకూర్చిన100 కేజీల స్వీట్స్ వివిధ రకాల పువ్వులు, పండ్లు,కూరగాయలు,పసుపు, కుంకుమ సమర్పణ చేశారు.శంకంబరి అలంకరణతో అలంకరించారు. ఈ కార్యక్రమా నికి ఎంపీపీ ఇళ్ల శేషగిరి రావు శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కదలి వెంకటేశ్వర రావు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఆగస్టు 10న పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక , రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఆగస్టు 10న యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో పీజీఆర్ఎస్, వివేకానంద హాలులో రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఇప్పటికే దాఖలు చేసిన అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే వీవవనిశీయిఎ.ఖజూ. స్త్రశీజ.ఱఅ ద్వారా అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్పందనను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్,మండల, మున్సిపల్ స్థాయిల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సమీపంలోని డివిజన్, మండల లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించి పరిష్కారం పొందాలని కలెక్టర్ కోరారు.

## హరిత వనం కార్యక్రమానికి శ్రీకారం



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 9:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు.రామచంద్రపురం పట్టణంలో నెలకు ఒకరోజు ప్రతి వ్యక్తి ఒక వృక్షాన్ని నాటాలనే సంకల్పంతో చేపట్టిన 'హరిత వనం' కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక శివాలయం ప్రాంగణం, ఎదురుగా ఉన్న పార్కులో మంత్రి సుభాష్ మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న వృక్ష జాతులను సంరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. హరిత వనం కార్యక్రమానికి మోదుగ మొక్కలను అందించిన దాతలు నేదునూరి చిరంజీవి బాబు,అనురాధ దంపతులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు,శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, గరిమెళ్ల వి.ఎస్.ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల నుంచి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని,దాతల సహకారంతో దీనిని నిరంతరం కొనసాగిస్తూ అంతరించిపోతున్న వృక్ష జాతుల సంరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవిల్లి శివ,కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఎస్ఎంఏ వ్యాధిపై అవగాహనకు కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో అవగాహన పరుగు






**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 9:** స్పైన్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇండియన్ కోస్ట్‌గార్డ్ స్టేషన్ కాకినాడ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ బోట్ క్లబ్ వద్ద అవగాహన పరుగు నిర్వహించారు. ఐసీజీఎస్ కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ కమాండెంట్ అనుజ్ నెర్వాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఎంఏ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, బాధితులకు అండగా నిలవడం, వారి కుటుంబాలకు మద్దతు అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడంతో పాటు బాధితులు, వారి కుటుంబాల పట్ల సానుభూతి, సహకార భావన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ అవగాహన పరుగు కార్యక్రమంలో ఇండియన్ కోస్ట్‌గార్డ్ అధికారులు,సహాయ అధికారులు, సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.మొత్తం 110 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. సమాజ శ్రేయస్సు, సామాజిక బాధ్యత పట్ల ఇండియన్ కోస్ట్‌గార్డ్‌కు ఉన్న నిబద్ధతను ఈ కార్యక్రమం చాటిచెప్పిందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఎస్ఎంఏపై నిరంతరం అవగాహన కల్పించడం,ముందస్తు నిర్ధారణను ప్రోత్సహించడం,వ్యాధి ప్రభావితులు,వారి కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని ముగించారు.

## దివ్యాంగుల సాధికారత జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** దివ్యాంగుల సాధికారతకు విశేష సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అందించే దివ్యాంగుల సాధికారత జాతీయ పురస్కారాలు-- 2026కు ఆన్‌లైన్‌లో నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.వ్యక్తిగత ప్రతిభ, దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న సంస్థలు తదితర విభాగాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హతలు, మార్గదర్శకాలు,దరఖాస్తు విధానం రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.అర్హులైన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఆగస్టు 15, 2026లోపు ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాలని కలెక్టర్ కోరారు.కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని విస్తృతంగా ప్రచారం చేసి అర్హులైన వారిని పురస్కారాలకు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వాలు మారిన పాలన తీరు మారలేదు.




* జెండాలు మారినా, అజెండాలు మారలేదు.
* రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి గంతలు కట్టిన స్థానిక నాయకుల తీరు.

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 9:** డిజిటల్ యుగంలో అందర్నీ అబ్బుర పరిచే రీతిలో ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మొదటి వరుసలో ఉంది. ఏవి వాస్తవాలు, ఏవి కల్పితాలో తెలియని స్థితిలో సామాన్యుడు ఉన్నాడు. రాష్ట్ర అభివృద్ధిపై మీడియాలో ప్రచురితమవుతున్న కథనాలు వింతగానే ఉన్నాయి. కారణం ఏలేశ్వరం పట్టణంలో గత సుమారు 7,8 సంవత్సరాలుగా అభివృద్ధి పేరిట అరాచకమే రాజ్యమేలుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అంచనాలతో అప్పటి టిడిపి నాయకుల కొంతమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. వారు ఊహించిన విధంగానే బంపర్ మెజారిటతో వైసిపి రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టారు. తదనంతరం జరిగిన స్థానిక ఎన్నికల్లో వైసిపి తన హవాను కొనసాగించింది. అప్పటి రాష్ట్ర వైసీపీ అధినాయకత్వం ఏ దిశా నిర్దేశం చేసిందో తెలియదు కానీ స్థానిక నాయకులు మాత్రం కొందరు స్థానిక సమస్యలు పక్కనపెట్టి దోపిడీయే ఎజెండా గా పాలన సాగించారు. ఒక ప్రక్క మీడియా స్వేచ్ఛను హరిస్తూనే మరో ప్రక్క కొంతమంది అధికారులను తమ కనుసన్నల్లో మసులుకునేటట్లు వ్యవహార సాగింది. స్థానిక పరిస్థితులకు విసిగి వేసారిన ప్రజానీకం 2024 లో జరిగిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వానికి మరింత భారీ మెజార్టీతో నెగ్గించి గత ప్రభుత్వ విధానాలను నిరసించారు.

అయితే ఇక్కడ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక విచిత్ర పరిణామం చోటు చేసుకుంది. వైసిపి ప్రభుత్వం హయాంలో కౌన్సిలర్లుగా నెగ్గి పదవులు అనుభవించిన నాయకులు కొందరు టిడిపి చెంతకు చేరి ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రజలు పార్టీ సిద్ధాంతాలు, ఎజెండాలు చూసే సమాజంలో మార్పు వస్తుందని నమ్మకంతో మళ్ళీ టిడిపికి పట్టం కట్టారు. కానీ విచిత్రంగా ప్రజలు తలచిందొకటి అయితే నాయకులు చేసేది మరొకటిగా ప్రస్తుత పరిస్థితులు నిలిచాయి. ఈ పరిస్థితులు ప్రజలకు మింగుడు పడడం లేదు. అసలు విషయాల్లోకి వస్తే కొత్త మైనింగ్ పాలసీ ప్రకటిస్తానని చెప్పిన జగన్ ఐదేళ్ల కాలంలో స్థానిక నేతలు నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ ను ప్రోత్సహిస్తూ ప్రభుత్వానికి చేరాల్సిన ప్రజాధనాన్ని లూటీ చేసి కొంతమంది నాయకుల జేబులు నింపారు. మద్యం పాలసీలో కొత్త విధానం లో నాయకులే సిండికేట్ వ్యాపారానికి తెర తీసి తప్పుడు లెక్కలతో ప్రభుత్వ ధనాన్ని లూటీ చేసారు. అప్పటి ప్రభుత్వంలో అన్ని మెళకువలు నేర్చుకున్న స్థానిక నాయకులు కొందరు ఎన్డీఏ కూటమి నాయకులు ప్రభుత్వానికి గంతలు కట్టి తమ దోపిడి వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో సంబంధిత అధికారులు అక్రమ మైనింగ్ కు, అక్రమ మద్యం దందాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారంటే దీని వెనుక ఉండి నడిపిస్తున్న కొంతమంది నాయకుల కబంధహస్తాల్లోనే చిదంబర రహస్యం దాగి ఉంది. సుమారు 7, 8 సంవత్సరాలుగా జరుగుతున్న ప్రజా ధనం దోపిడీ కోసం ప్రస్తుతం రాష్ట్రాన్ని రెండున్నర ఏళ్లుగా ఏలుతున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి తెలియకపోవడం విడ్డూరం కాదా?! ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న ఏలేశ్వరం మున్సిపాలిటీలో శృతి మించిన రాజకీయ నడుస్తుంది. గోడమీద పిల్లిల్లా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కోసం ఎదురుచూస్తున్న నాయకులు కొందరు ఏ విధమైన అధికారం లేకపోయినా పట్టణంలో అధికారం చెలాయి స్తున్నారు. అక్రమ మైనింగ్ ఇసుక, మట్టి, నల్ల కంకర లారీల రవాణాకు వారు చెప్పినట్లు వింటేనే వ్యవహారం సాగుతుంది. ఇకనైనా రాష్ట్ర పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు ఏలేశ్వరం మండలంలో 8 ఏళు ్లగా నల్ల కంకర క్వారీల లో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకొని ప్రజాధనాన్ని కాపాడాలని, మద్యం సిండికేట్ల అక్రమ దందాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేసి మద్యం, మైనింగ్ మాఫియాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 28 జిల్లాల వారీగా జడ్పీలు, ఆసుపత్రులు, గ్రంథాలయాలను వికేంద్రీకరించాలి




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల సంఖ్యను 28కి పెంచినప్పటికీ, ప్రజా సంక్షేమంతో ముడిపడిన జిల్లా పరిషత్తులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులు, జిల్లా గ్రంథాలయ సంస్థలను కొత్త జిల్లాల వారీగా ఇప్పటికీ వికేంద్రీకరించకపోవడం సరికాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఈ మూడు వ్యవస్థలను తక్షణమే 28 జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కొత్త జిల్లాలు ఏర్పడి చాలాకాలం గడిచినా జిల్లా పరిషత్తులు ఇప్పటికీ పాత 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నికైన 13 జడ్పీ చైర్మన్లు, పాలకవర్గాల పదవీకాలం 2026 సెప్టెంబర్ 24తో ముగియనున్న నేపథ్యంలో, ఎలాంటి జాప్యం లేకుండా 28 జిల్లాల వారీగా కొత్త జడ్పీల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. దీనివల్ల జడ్పీ నిధుల సద్వినియోగంతో పాటు స్థానిక పాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని అన్నారు.వైద్య రంగంలోనూ కొత్త జిల్లాల స్థాయిలో మౌలిక వసతులు, నిధులు, అత్యవసర, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.పాత జిల్లా కేంద్రాలపై ఆధారపడాల్సి రావడంతో కొత్త జిల్లాల పరిధిలోని పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరమైన గ్రంథాలయ వ్యవస్థను కూడా 28 జిల్లాల వారీగా బలోపేతం చేయాలని రమణరాజు కోరారు. ప్రస్తుతం 13 జిల్లా గ్రంథాలయ సంస్థల పరిధిలోనే వ్యవస్థ కొనసాగుతుండటంతో కొత్త జిల్లాల్లో పుస్తకాల పంపిణీ, డిజిటలైజేషన్ తదితర కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు.ప్రజలకు నిత్యావసరమైన స్థానిక పరిపాలన, వైద్యం, విద్యా వికాసానికి సంబంధించిన ఈ మూడు రంగాలను 28 జిల్లాల వారీగా తక్షణమే వికేంద్రీకరించి నిజమైన ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం తరఫున దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు.ద

## ప్రత్తిపాడులో ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 09:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సినీ నటుడు మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు అంబేద్కర్ కళామందిర్ సెంటర్లో మహేష్ బాబు అభిమానులు బత్తుల వెంకటేష్,గాలి అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథులుగా పిసిసి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు. ధరణాలకోట శ్రీను పాల్గొన్నారు. కేక్ కటింగ్ చేసారు.మహేష్ బాబు అభిమానులు బత్తుల వెంకటేష్ గాలి అంజి ఆధ్వర్యంలో ధరణాలకోట శ్రీను ను సాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మేడపాటి కృష్ణ,దడాల రాజు.ఈరుగు రాఘవులు పలువురు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా చిలకలపాడు పోలేరమ్మవారికి శాకాంబరీ అలంకారం.



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 09;**మండలంలోని మడికి శివారు చిలకలపాడు గ్రామదేవత పోలేరమ్మ వారికి ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాకాంబరి అలంకారం చేశారు. ఇందుకు రకరకాల తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో సుందరంగా అలంకరించి, చీర, సారేలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఇది ప్రకృతిని, పంటల సమృద్ధిని, లోకానికి ఆహారాన్ని అందించే అమ్మవారి కరుణను గుర్తుచేస్తుందని ఆలయ నిర్వాహకులు పాలూరి సత్తిబాబు తెలిపారు. సర్వసాధారణంగా ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు ఈ ప్రత్యేక అలంకారం ప్రాముఖ్యతను సంతరించుకుని ప్రకృతికి ప్రతీక నిలుస్తుందన్నారు. ఇది భూమిపై సస్యశ్యామలాన్ని, వర్షాలు బాగా కురవాలని కోరుకుంటూ చేసే సంప్రదాయ ఆచారం అన్నారు. వందలాది వివిధ రకాల కాయగూరలు, పండ్లు, పచ్చని ఆకుకూరలతో అమ్మవారి అలంకరణ ఆద్యంతం భక్తి ప్రవర్తలను ప్రోత్సహించేలా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్సవాలలో భాగంగా భారీ అన్నదానం నిర్వహించారు.

## బాధిత కుటుంబాలకు సిఎంఆర్ రిలీఫ్ ఫమడ్ చెక్కులు పంపిణీ





**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 09:**కూటమి ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తూ సంక్షేమం పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తుందని కూటమి నాయకులు అన్నారు. మండలంలోని నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామ లలో ఆదివారం కూటమి నాయకులు బాదిత కుటుంబాలకు సిఎంఆర్ రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ అందచేసారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నీటిపారుదలశాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి డైరెక్టర్ మట్టపర్తి భారతి, కూటమి నాయకులు గణపతి వీర రాఘవులు, గూడాల ఫణి, రవణంరాము, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, పేరాబత్తుల పెద సుబ్బరాజు, తిక్కా ప్రకాష్ తదిత్ఉలు పాల్గొన్నారు.

## ముదునూరి మురళీకృష్ణంరాజుకు ఘన సన్మానం.






**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఆగస్టు, 09:** ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా ప్రత్తిపాడు ఎంపిపి గోళ్ళ క్రాంతి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి సాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. వారితోపాటు అన్నవరం ఎంపీటీసీ దడాల సతీష్,ప్రత్తిపాడు ఎంపీటీసీ సేశీద్రపు భాస్కరరావు ,ముఖ్య నాయకులు బవురువాక మాజీ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్, వెంకటరమణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు లక్ష్మీ, సతీష్ రాజు, చిట్టిబాబు, కృష్ణ, కిషోర్ పలువురు ముఖ్య నాయకులు పాల్గొని మురళీ కృష్ణంరాజును ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## నేడు ముత్యాలమ్మ తల్లి జాగరం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 09:** నందంపూడి గ్రామ దేత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాగరం, తీర్ధం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటి తెలిపింది. సోమవారం రాత్రి జాగరం 11, వ తేదీ తీర్ధం, 16 వ తేదీన అమ్మవారి జలకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి ని దర్శించుకోవాలని కోరారు.

## శ్రీరావులమ్మ అమ్మవారికి ఆషాఢ సారె,వందలాది కేజీల. మిఠాయిలు, వంటకాలు సమర్పణ



**శాకంబరి మాతగా భక్తులకు దర్శనం**

**ఆలమూరు,పెన్ పవర్, ఆగస్టు 09;**మండలంలోని సంధిపూడిలో వేంచే సియున్న గ్రామ దేవత శ్రీరావులమ్మ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ జరిగింది. ఆషాఢమాసం ఆదివారం రోజున వచ్చిన కామినీ ఏకాదశి సందర్భంగా తొలుత వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో శాకంబరిగా అమ్మవారిని భక్తులు అలంకరించారు. అనంతరం గ్రామంలో భక్తులు స్వయంగా తయారు చేసిన వందలాది రకాల స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులు, చీర సారెలతో ఆగ్రామ అడపడచులు సన్నాయి వాయిధ్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. దీంతో అమ్మవారి ప్రాంగణం అంతా సారెకు తీసుకువచ్చిన మిఠాయిలు, వంటకాలతో కళకళ లాడింది. ఈసందర్భంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి ఈ విధంగా సారె సమర్పించడం ఆనందంగా ఉందని మహిళలు వ్యాఖ్యానించారు. నృత్య కళాకారుల గరగ నృత్యం, భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

**శాకంబరీగా రావులమ్మ అమ్మవారు**

మండలంలోని సంధిపూడిలో వేంచేసియున్న శ్రీరావులమ్మ అమ్మవారు శాకంబరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు అనేక రకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన తీరు భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఈసందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

# ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి: ఆర్డీవో కృష్ణమూర్తి





- పాండవులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- సాంప్రదాయ నృత్యాలతో అలరించిన విద్యార్థులు..

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 09:**ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆనందోత్సవాల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి (డిప్యూటీ కలెక్టర్) ఏ శ్రీనివాసరావు, పెద్దాపురం ఆర్డీవో పి కృష్ణమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎన్ నాగమల్లేశ్వరరావు, తహశీల్దార్ ఎం సూర్యప్రభ, మండల అభివృద్ధి అధికారి, ఎంవిఆర్ కుమార్ బాబు, మండల విద్యాశాఖ అధికారి, వి రాజబాబు తదితరులు విచ్చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. వేడుకల్లో భాగంగా అధికారులు విద్యార్థులతో కలిసి ఆటపాటల్లో భాగస్వాములై సందడి చేశారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ గిరిజన పెద్దలను అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అధికారులు సహపంక్తి భోజనాలు చేశారు.
ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాల హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రస్తుతానికి వసతులు సక్రమంగానే అందుతున్నాయని, రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అనే దానిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అలాగే పాండవులపాలెం ప్రాంతంలో ఉన్న స్థానిక ఇళ్ల పట్టాలు, భూ సమస్యలు, క్యాస్ట్ సర్టిఫికెట్లు, గ్రామాల్లో మంచినీటి సమస్య,ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలికల ఉన్నత పాఠశాల చైర్మన్ రాజబాబు, హెచ్ఎం సిహెచ్ అబ్బాయి రెడ్డి, వార్డెన్ ఎన్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సునీత, రమేష్ దొర, గ్రామ గిరిజన నాయకులు గుమ్మడి అన్నవరం, రేచకట్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# వెదిరేశ్వరంలో వైభవంగా శ్రీ లక్ష్మీ గణపతి వార్షికోత్సవం





**కొత్తపేట /రావులపాలెం, పెన్ పవర్, ఆగస్టు 9:**రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామం బొక్కవారిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారిని ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా తొలి వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
వార్షికోత్సవంలో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించి, అనంతరం లక్ష్మీ పూజ, నవగ్రహ పూజ, ప్రత్యేక హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా బొక్కవారిపాలెం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందుతూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.వార్షికోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ వార్షికోత్సవం విజయవంతంగా జరగడంతో గ్రామస్తులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## ఘనంగా మండలవ్యాప్తంగాప్రపంచఆదివాసి దినోత్సవం





**-ఆదివాసిగిరిజన,సంఘాలనాయకులు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.9**
ప్రతికా,ప్రకటనలుమాకొద్దు,ఏజెన్సీలోఆదివాసీల కు వందశాంతం ఉద్యోగనియామకచట్టంకావాలని,1/70 చట్టపరిరక్షణముఖ్యం,అంటూప్రపంచఆదివాసి దినోత్స వంసభలో,ఆదివాసీసం ఘాలనాయకులుడిమాండ్,చే శారు.ప్రపంచఆదివాసిదినోత్సవంసందర్భంగాఆ దివాసి సంఘాలఐక్యవేదికఆధ్వర్యం లోమండలవ్యాప్తంగామరి యు,ఆదివాసిగ్రామాల్లోఘనంగాఆదివాసిజెండా ఆవిష్కరణలు,చేయడంజరిగింది.మండలంలోని రేఖపల్లి,గ్రామసచివాలయప్రాంగణంలోఆదివార ం ఆదివాసిగిరిజన, సంఘాలనాయకులు ,పెద్దఎత్తున ప్రపంచఆదివాసిదినోత్సవం సభను,ఘనంగాజరుపు కోవడంజరిగింది .ఆదివాసిసంఘాలనాయకులుమా ట్లాడుతూఆదివాసిహక్కులుచట్టాలనుఅమలుచే యడంలోపాలక,ప్రభుత్వాలుసవతితల్లి,ప్రేమను చూపడంతోఉన్నచట్టాలనుతుంగలోతొక్కాలనిచ ూ స్తున్నాయని,ఇదేవిధం గావ్యవహరిస్తే,ఆదివాసిసం ఘాలనాయకులు ,ఉప్పెనలాకదిలి,పెద్దఎత్తున,పోరు బాటనడుతుందని,హెచ్చరించారు.రెండు,మూడ ు సంవత్సరాలుగా జీవోనెంబర్,3పైపాల కప్రభుత్వాలు ప్రతికాప్రకటనలకుమాత్రమే పరిమితంఅవుతున్నా యని,పునరుద్ధరించి ,చట్టంచేయడంలోచిత్తశుద్ధి,చూ పడంలేదని, ఆవేదనవ్యక్తంచేశారు.ప్రస్తుతంఆదివాసిల భూములకురక్షణగాఉన్నటువంటి1/70చట్టాన్ని నిర్వీ ర్యంచేయాలని,కొంతమంది కుట్ర దారులుకేసులువేస్తుం టేఆచట్టాన్నికాపాడడం కోసంసుప్రీంకోర్టులో పిటిషన్, వేయకుండాప్రభుత్వంచోద్యంచూస్తుందని,పేర్కొ న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంస్పందించి,ఆదివాసిహక్కులు చట్టాలనుఅమలుచేయడంలోముందుకురావాల ని కోరారు. ఈకార్యక్రమంలోమండల ఎంపీపీ,జడ్పిటిసి, ఎంపీటీసీలు,సర్పంచులు ,పీసాకమిటీ సభ్యులు,ఆది వాసిసంఘాలనాయకులు,ప్రజాఉద్యోగ,సంఘా లనా యకులు,తదితరులుపాల్గొన్నారు.

## అడ్డతీగల లో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం...





**అడ్డతీగల,పెన్ పవర్, ఆగస్టు 09:** మండల కేంద్రమైన అడ్డతీగల లో ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అడ్డతీగల ఆశ్రమ పాఠశాలలో రంపచోడవరం డిఎస్పి అశ్రుఫ్ ఆలీ మరియు అడ్డతీగల సీఐ ఎం .గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పెన్నులు, పెన్సిల్, స్కేలు సుమారు 200 మంది హై స్కూల్ ,కాలేజ్ విద్యార్థినిలకు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి అశ్రుఫ్ ఆలీ మాట్లాడుతూ విద్యార్థులంతా మంచి చదువులు చదివి ఉన్నతమైన పదవులు అవరోదించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరుతీసుకురావాలని అన్నారు. అలానే మహిళల భద్రతకు పటిష్టమైన చట్టాలు ఉన్నాయని, దీనిపై ఈగల్ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందని మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురి అయినట్లయితే తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని డీఎస్పీ తెలిపారు. అనంతరం విద్యార్థినులు చేత కేక్ కట్ చేయించారు. అనంతరం విద్యార్థినిలు గిరిజన సంప్రదాయ నృత్యాలను, మరియు దిమ్మిస నృత్యాన్ని ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలానే ఆదివారం ఆదివాసి భవన్లో ఆదివాసి దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంస్కృతి ,సంప్రదాయాల గురించి పలువురు వక్తలు వివరిస్తూ, ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని, ప్రతి ఆదివాసీ యువకుడు మంచి విద్యను అభ్యసిస్తూ అత్యంతమైన స్థానాలను అవరోధించాలని, ఏ ఒక్కరూ కూడా చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని వివరించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవం ఘనంగానిర్వహించుకుంటున్నామని అలానే ఈ సంవత్సరం కూడా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంప్రదాయ నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమానంతరం అడ్డతీగల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొన్నారు.

## బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి




**జీలుగుమిల్లి,, పెన్ పవర్, ఆగస్టు 9 ;** కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసించడానికి సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం మార్పు కోసం సిపిఐ ఆధ్వర్యంలో మండలంలోని లంకలపల్లి, కామయ్యపాలెం, జీలుగుమిల్లి, అంకంపాలెం, రౌతు గూడెం, ములగలంపల్లి గ్రామాలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఆరవ తేదీ నుండి 15వ తేదీ వరకు పాదయాత్రలు, ఆగస్టు 17 తేదీ నుండి 28 వరకు ప్రజా సంఘాల ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు .ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుదించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని అన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించి దళిత ఆదివాసులపై దాడులను నిలిపివేలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు కొప్పుల నాగరాజు, ద్వారకాతిరుమల సిపిఐ మండల కార్యదర్శి జి బాల యేసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిద్దు, నాయకులు కే శ్రీను, కే వీరభద్రం, కొక్కిరిగడ్డ ఆనందరావు, పురేటి పెద్ద కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 9;** మానవతా దృక్పథంతో ఓర్సు శ్రీనివాస్ కి 75 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు పోలవరం ఎమ్మెల్యే సిర్రి బాలరాజు తెలిపారు .ఆదివారం కనకాపురం గ్రామంలో ఓర్సు శ్రీనుకి అందించారు. జాతీయ రహదారి విస్తరణలో సర్వేలో ఓర్సు శ్రీను నివాసం నమోదు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే అవకాశం లేకపోవడంతో ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు అనిల్, కొప్పుల శ్రీకాంత్, సొంటి రామకృష్ణ, నేలటూరి మోహన్ ,బండారు సత్యనారాయణ, సిరి బత్తుల స్వామి, గణేష్, కుంజ రమేష్ తదితరులు పాల్గొన్నారు.ద

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ భారీ ర్యాలీ

- ర్యాలీలో ఆకట్టుకున్న ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 9:**ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తూర్పు గోదావరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్తానిక ఆర్ట్స్ కళాశాల నుండి కంబాల చెరువు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కె.ఎన్. జ్యోతి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ లో గిరిజనుల సాంస్కృతిక వారసత్వం,సంప్రదాయాలు, రాజ్యాంగబద్ధ హక్కులు సమగ్ర అభివృద్ధి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె ఎన్ జ్యోతి తెలిపారు.
ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై నినాదాలు చేశారు. "ఆదివాసీ సంస్కృతి -- అందరి సంపద", "గిరిజన హక్కులు కాపాడుదాం", "దేశీయ జ్ఞానాన్ని గౌరవిద్దాం", "అడవి -- ఆదివాసీ జీవనాధారం", "సమాన హక్కులు -- సమగ్ర అభివృద్ధి" వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఆదివాసీ కళా సంస్కృతిని ప్రతిబింబిస్తూ సంప్రదాయ వేషధారణలో కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పులు, తుడుములు గిరిజన వాద్యాల నాదంతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆదివాసీ సమాజం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పాయి. ఈ కళా ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకుడు ఎస్. గన్నయ్య, ప్రొఫెసర్ మల్లి భాస్కర్ రావు, కే. నారాయణరావు, గరికపాటి సురేష్, ఎస్.ఎస్. చంద్రరావు, ఎం. వీరభద్రరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.